# తవ్వేసి వదిలేస్తున్నారు

- అంతర్గత రహదారుల నిర్మాణంపై నిర్లక్ష్యం
- లష్కర్‌లో వందకుపైగా అదే పరిస్థితి


సీతాఫల్‌మండిలో అంతర్గత రహదారుల నిర్మాణం కోసం చేసిన తవ్వకాలు

**సికింద్రాబాద్:** అంతర్గత రహదారుల నిర్మాణాల్లో జరుగుతున్న జాప్యంతో సికింద్రాబాద్ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. నియోజకవర్గంలో చేపడుతున్న నిర్మాణ పనులను నెలల తరబడి పూర్తి చేయని కారణంగా ఆయా ప్రాంతాల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. సాంకేతిక కారణాలను సాకుగా చూపుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్మాణం పనుల పేరుతో రహదారులను తవ్వేసి ఆపై అర్ధంతరంగా నిలిపివేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో అంతర్గత రహదారుల నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. సాంకేతిక కారణాలతో కొన్ని, జలమండలి అభ్యంతరాలతో మరికొన్ని రహదారుల నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. కేవలం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో మరిన్ని రహదారుల నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. జలమండలి అధికారుల అభ్యంతరాలతో 54 వరకు రహదారుల నిర్మాణం పనులు నిలిపివేసినట్టు జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. మహ్మద్‌గూడ, పార్శిగుట్ట, అడ్డగుట్ట ఏబీసీ సెక్షన్లు, లాలాపేట, మెట్టుగూడ ప్రాంతాల్లోని పలు అంతర్గత రహదారుల నిర్మాణం పనులు ప్రస్తుతం ఆగిపోయి ఉన్నాయి.

### సమన్వయం లేమితో...

కొన్ని రోడ్ల నిర్మాణం విషయంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు వ్యవహరిస్తున్న తీరు స్థానిక ప్రజలకు తలనొప్పి వ్యవహారంగా తయారవుతుంది. రెండు శాఖల మధ్య సమన్వయ లేమి కారణంతో రహదారుల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుంది.

- జీహెచ్‌ఎంసీ అధికారులు టెండర్లు ఖరారు చేసుకుని రోడ్ల నిర్మాణం కోసం పాత రోడ్లను అడ్డంగా తవ్వేస్తున్నారు. ఆ తరువాత మేల్కొంటున్న జలమండలి అధికారులు అక్కడి భూగర్భం నుంచి వాటర్ లైన్లు వేయాల్సి ఉందని, లైన్లు వేయక ముందే రోడ్ల వేయకూడదని అభ్యంతరం చెబుతున్నారు. దీంతో నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణాల సందర్భంలో ఇటువంటి పరిస్థితులు ఎదురవుతున్నపుడల్లా నిర్మాణం పనులు నెలల తరబడి ఆగిపోతున్నాయి. నిర్మాణం పనుల్లో జాప్యం ఆపై రహదారుల గుండా ప్రయాణాలు సాగించడం స్థానికులకు ఇబ్బందికరంగా పరిణమిస్తుంది.

### అనారోగ్య పరిస్థితులు....

నిర్మాణం పేరిట తవ్వేసిన రహదారులు మురుగునీటిమయం అవుతున్నాయి. ఛిద్రమై ఉన్న అంతర్గత రహదారులు ప్రయాణికుల పాలిట ప్రమాదకరంగా పరిణమించడంతోపాటు అనారోగ్యకర పరిస్థితులను తెచ్చిపెడుతున్నాయి. రహదారులు తవ్వేసిన సందర్భాల్లో ధ్వంసమవుతున్న డ్రైనేజీ లైన్లద్వారా రహదారులు మురుగునీటి మయం అవుతున్నాయి. తవ్వేసిన రహదారులు పూర్తిగా మురుగునీటి మయం అవుతుండడంతో పాదచారులు కూడా అడుగుతీసి అడుగెయ్యని పరిస్థితులు దాపురిస్తున్నాయి. పార్శిగుట్ట, మహ్మద్‌గూడ, అడ్డగుట్ట వంటి లోతట్టు ప్రాంతాల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. ఇక్కడి పలు రహదారుల్లోని మ్యాన్‌హోళ్లు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా పరిణమించాయి.

## వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి


ఉచితవైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భద్రారెడ్డి

**రసూల్‌పురా:** మల్లారెడ్డి హస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న వైద్య సేవలు పేదలు సద్వినియోగం చేసుకోవాలని మల్లారెడ్డి హెల్త్ సిటీ హస్పిటల్స్ చైర్మన్ చామకూర భద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం రసూల్‌పురా గనబజార్ కమ్యూనిటీ హాల్‌లో మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఇంచార్జీ టిఎన్. శ్రీనివాస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డాక్టర్ భద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ హాస్పిటల్స్‌లో ఐపీ సేవలు, సామాన్య రక్త పరీక్షలు శస్త్ర చికిత్సలు, కాన్పులు, లెన్సులు, ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో ఎముకలు విరిగినట్లయితే ఆపరేషన్లు మోకాళ్ళకి సర్జరీలు చికిత్స చేస్తు న్నామని తెలిపారు. రసూల్‌పురాలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందాలనే సదుద్దేశంతో ఉచిత మేగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కుమార్, దేవులపల్లి శ్రీనివాస్, శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలుచేయకుంటే ఉద్యమమే


మాట్లాడుతున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఎమ్మెల్యే తలసాని

**సనత్‌నగర్:** గడువు లోగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయకుంటే ప్రజల పక్షాన పోరాడేందుకు వెనుకాడబోమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు ప్రకటించిన 100 రోజుల్లో రెండు నెలలు గడిచిపోయాయని, ఇంకా 40 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. ఆ లోగా హామీలు అమలుచేయని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే రెండు హామీలను అమలు చేస్తున్నామని చేస్తున్న ప్రచారం అవాస్తవమని, కేవలం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒక్కటే అమలవుతుందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, కుర్మ హేమలత తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహ రాజధానిగా భారతదేశం


సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ భాస్కర్‌రావు

**రాంగోపాల్‌పేట్:** భారతదేశంలో 6.2 కోట్ల మంది మధుమేహం వ్యాధితో బాధపడుతున్నారని వీరిలో ప్రతి ఏటా సుమారు 10 లక్షల మందికి ఫుట్ అల్సర్‌తో పాదాలను ఎంతో కొంత మేర తొలగించాల్సి వస్తోందని కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. రెండు రోజుల పాటు జరిగే శాస్త్రీయ సదస్సు శనివారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారతదేశం మధుమేహ రాజధానిగా మారిందని ఈ వ్యాధి బారినపడిన వారు పాదాల పట్ల జాగ్రతలు తీసుకోవడం లేదన్నారు. మధుమేహంతో ఫుట్ అల్సర్‌కు గురైన వారు తగిన జాగ్రత్తలు, వైద్యం తీసుకోకపోవడం వలన పాదాలను ఎంతో కొంత మేరకు తొలగించాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. కిమ్స్ వాస్క్యులర్ విభాగాధిపతి, ఎండో వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ నరేంద్రనాథ్ మేడా తదితరులు పాల్గొన్నారు.

## ట్యాక్సులు కడుతున్నా వేధింపులా?

**రాంగోపాల్‌పేట్:** ఆర్టీఏకు ట్యాక్సులు చెల్లిస్తూ, నిబంధనల ప్రకారం కాంట్రాక్టు క్యారియర్లుగా బస్సులను నడిపిస్తున్న తమపై ట్రాఫిక్ పోలీసులు వెంటనే వేధింపులను ఆపాలని బస్సు ఆపరేటర్లు కోరారు. శనివారం ప్యారడైజ్ వద్ద బేగంపేట ట్రాఫిక్ పోలీసులు భారీ వాహనాలు అనుమతి లేని సమయంలో నగరంలోకి ప్రవేశించాయని రెండు బస్సులను నిలిపివేసి కేసు నమోదు చేసేందుకు రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మహ్మద్ సలీం నాయకులు ఎండీ అహ్మద్, సయ్యద్ బిలాల్, మహ్మద్ అబ్దుల్ హది తదితరులు విలేకరులతో మాట్లాడారు. తాము వివాహాది శుభకార్యాలు, సైట్ సీయింగ్ లాంటి వాటికి బస్సులను నగరంలో, బయట తిప్పుతామని దీని కోసం హైదరాబాద్-సికింద్రాబాద్ పరిధిలో తిప్పుకునేందుకు మూడు నెలలకు ఒక మారు సుమారు 60 వేలు ఆర్టీఏకు ట్యాక్సు చెల్లిస్తున్నామని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే స్టేజ్ క్యారియర్ బస్సులు నిర్ణీత సమయంలో నగరంలోకి ప్రవేశం ఉంటుందని, కాంట్రాక్టు క్యారియర్లుగా నడిపించే తమకు ఆ నిబంధనలు వర్తించవని వారు చెప్పారు. పోలీసులు అవగాహన రాహిత్యంతో తమ బస్సులను నిలిపివేసి అటు ప్రయాణికులను, ఇటు తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

## లాలాగూడ రైల్వే ఆస్పత్రిలో వెల్ బెబీ షో



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘం ఉపాధ్యక్షురాలు శ్రీలత ధనుంజయులు

**అడ్డగుట్ట:** దక్షిణ మధ్య రైల్వే మహిళ శిశు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లాలాగూడ కేంద్రీయ ఆస్పత్రిలో శనవారం నిర్వహించిన వెల్‌బెబీ షో ఆకట్టుకుంది. బోసి నవ్వులు, పాలు కారే బుగ్గలు... బుడిబుడి నడకలతో 70 మంది చిన్నారులు షోలో పాల్గొన్నారు. పిల్లల ఆరోగ్యం, బరువు, ఎత్తు, వ్యాధి నిరోధక టీకాలు తదితర అంశాలు పరిగణలోకి తీసుకొని బహుమతులు అందజేశారు. సంఘం ఉపాధ్యక్షురాలు శ్రీలత ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అన్నదానం



**పద్మారావునగర్:** బన్సీలాల్‌పేట్ డివిజన్ శ్మశానవాటిక సమీపంలోని దేవనార్ జూనియర్, డిగ్రీ వీజువల్లీ ఛాలెంజ్డ్ కళాశాలలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం కళాశాల ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పద్మారావునగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంబీఆర్ సంస్థల చైర్మెన్ మామిడి బాల్‌రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మామిడి బాల్‌రెడ్డి మాట్లాడుతూ కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు ముందుకు సాగాలని చెప్పారు. దివ్యాంగులను ప్రతి ఒక్కరూ అక్కున చేర్చుకొని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ ప్రతినిధులు సంజీవకుమార్, పావనీ పాల్గొన్నారు.

## డి-రిజర్వేషన్ విధానంపై పునరాలోచించాలి


మాట్లాడుతున్న ప్రొ.లింబాద్రి

**ఉస్మానియా యూనివర్సిటీ:** డి-రిజర్వేషన్ విధానం పై పునరాలోచించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి అన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాలులో ఏఐఎఫ్‌సీటీవో, తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మేథోమధనం జరిగింది. ఓయూ అధ్యాపకులు డా.కొండ నాగేశ్వర్ అధ్యక్షత వహించగా ప్రొ.లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీసీ ప్రతిపాదిస్తున్న డి-రిజర్వేషన్ పాలసీ రాజ్యాంగ విరుద్ధమని దీని పై పునరాలోచించాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో వేదపారాయణం



**చిలకలగూడ:** సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేదపారాయణం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. లోక కళ్యాణార్థం టీటీడీ చేపట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా శ్రీగిరి ప్రసన్న వెంకన్న స్వామి బాలాలయంలో పలువురు ఋత్వికులు నిర్వహించిన వేద పారాయణం భక్తుల్లో ఆధ్యాత్మిక భక్తిభావాన్ని నింపింది.

## చిన్నారుల సందడి



**రాంగోపాల్‌పేట్:** కార్ఖానాలోని క్లారా ది స్కూల్ వార్షికోత్సవం శనివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ట్రెస్మా అధ్యక్షులు మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారుల ప్రదర్శనకు ఆహూతులు ముగ్దులయ్యారు. పాఠశాల చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయినీలు తదితరులు హాజరయ్యారు.

## కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలి

**ఉస్మానియా యూనివర్సిటీ:** వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి శనివారం వినతి పత్రాలు సమర్పించినట్లు సంఘం అధ్యక్షులు డా.పరుశురామ్ తెలిపారు. గత ప్రభుత్వం ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నికల్ అధ్యాపకులను పర్మనెంట్ చేసి కేవలం వర్సిటీ అధ్యాపకులను విస్మరించారని పేర్కొన్నారు. వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు జూనియర్ కాలేజీ అధ్యాపకుల వేతనాల కంటే తక్కువ చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### తెలుగు వర్సిటీకి గద్దర్ పేరు పెట్టండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి దివంగత ప్రజాకళాకారుడు గద్దర్ పేరు పెట్టాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఓయూ విద్యార్థి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఓయూలో గద్దర్ పేరుతో సాహిత్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, బీఆర్‌ఎస్ పాలనలో పీహెచ్‌డీతో పాటు పీజీ, డిగ్రీ కోర్సులకు పెంచిన ఫీజును తగ్గించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

### యూజీసీ పరిధిలోనే కొనసాగించండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను యూజీసీ పరిధిలోనే కొనసాగించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ప్రైవేటు కాలేజీ నిర్వాహకులు వినతి పత్రం సమర్పించారు. శనివారం ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబోయిన నర్సింహయాదవ్, ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్ వినతి పత్రం అందించారు. యూజీసీ నుంచి ఏఐసీటీఈ పరిధిలోకి బదిలీ చేయడం వలన డిగ్రీ కాలేజీలు మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.

## క్లుప్తంగా...

### ఓపెన్ వర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సనత్‌నగర్:** అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని వర్సిటీ స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మారోజు రమాచారి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో వివిధ కోర్సుల అడ్మిషన్లకు ఇంటర్మీడియెట్ పూర్తయిన, ఓపెన్ ఇంటర్, ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులుగా పేర్కొన్నారు. దూర విద్యా విధానం ద్వారా డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరాలనుకునేవారు దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 16 వరకు గడువును పొడిగించినట్లు చెప్పారు. అలాగే మూడు, నాలుగో సంవత్సర సెమిస్టర్ పరీక్షలకు రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.

### సత్కారం


టీపీసీసీ వైస్ చైర్మెన్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు లలిత, రామలీలలు

**అడ్డగుట్ట:** టీపీసీసీ వైస్ చైర్మెన్‌గా ఇటీవల ఎన్నికైన రమేష్‌ను అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు లలిత, రామలీలలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ చైర్మెన్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్‌ను కలిసిన ఎన్‌ఎస్‌యూఐ నేతలు



**అడ్డగుట్ట:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తుకారాంగేట్‌కు చెందిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సృజన్ మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం సికింద్రాబాద్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలతో వెళ్లిన సృజన్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను విన్నవించారు.

### నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా రాంబాబు



**లాలాపేట:** నల్లకుంట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా రాంబాబు నియమితులయ్యారు. శనివారం పీఎస్‌లో ఎస్‌హెచ్‌ఓగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

### అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

**రాంగోపాల్‌పేట్:** అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలని మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక అన్నారు. సెయింట్ ఫ్రాన్సిస్ రోడ్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు, సలూజ నర్సింగ్ హోం ప్రాంతంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె శనివారం జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణాలు పూర్తయితే స్థానికులకు ఇబ్బందులు తొలగిపోతాయని, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణాల వలన మురుగు నీటి సమస్య తీరుతుందన్నారు.

### హెచ్‌పీఎస్ భూముల లీజు రద్దుచేయండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** రామాంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఓయూ నుంచి తీసుకున్న భూముల లీజును రద్దు చేయాలని బీఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకులు శనివారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం సమర్పించారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న స్కూల్ లీజును రద్దు చేయాలని బీఎస్‌ఎఫ్ నాయకులు వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి, అంబేద్కర్, రవి తదితరులు రిజిస్ట్రార్‌ను కోరారు.

### రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ మృతి

**సికింద్రాబాద్:** రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. శనివారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేట్రాక్ మధ్య మహిళ మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతురాలి వివరాలు పోలీసులకు లభించలేదు. మృతురాలికి సుమారుగా 40 సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

## ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ పనులు


ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతున్న కార్పోరేటర్ సామల హేమ

**సికింద్రాబాద్:** సీతాఫల్‌మండి కూడలిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టనున్నట్టు స్థానిక కార్పోరేటర్ సామల హేమ తెలిపారు. గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఆమె శనివారం సీతాఫల్‌మండి చౌరస్తాలో పరిస్థితిని సమీక్షించారు. కూడలి మధ్యలో నిర్మాణం పనులు జరుగుతున్నందున వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆమె కోరారు. జలమండలి సెక్షన్ మేనేజర్ అన్విత్ మాట్లాడుతూ రూ.36 లక్షలతో జోషి కాంపౌండ్‌కు భూగర్భ వేస్తున్నట్టు తెలిపారు.

## మూత్రశాలలు ఏర్పాటు చేయాలి : సీఐటీయూ


తుకారాంగేట్ లేబర్ అడ్డా వద్ద ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

**అడ్డగుట్ట:** తుకారాంగేట్ లేబర్ అడ్డా వద్ద మూత్రశాలలు ఏర్పాటు చేయాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం తుకారాంగేట్ లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ తుకారాంగేట్‌లోని లేబర్ అడ్డా దగ్గర దాదాపు 800 మంది కార్మికులు ఉంటారని, వారికి సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందువల్ల వారికి మూత్రశాలలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వాలు మారుతున్నా పేదల బతుకులు మారడం లేదన్నారు. కేంద్ర బిజేపీ ప్రభుత్వం లేబర్ చట్టాలను తొలగించి లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్. మల్లేష్, రవి, రమేష్, రాజు నాయక్, కృష్ణ, లక్ష్మమ్మ, వెంకటమ్మ, పరుశురాములు, రాంబాబు, శ్రీను, మల్లేష్, నరసింహ పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ సేవలు స్ఫూర్తిదాయకం


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సనత్‌నగర్:** సీనియర్ సిటిజన్స్ సమాజంలో భాగస్వాములుగా నిలుస్తూ నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. వారు నిర్వహించే కార్యక్రమాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ సర్కిల్-17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన సీనియర్ సిటిజన్స్‌కు శనివారం సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేశారు. మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం వయోవృద్ధులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మోడల్‌కాలనీ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి జెఎస్‌టీ శాయి, డీపీ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

### పీజీ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తాం

**రసూల్‌పురా :** సికింద్రాబాద్ పీజీ కళాశాలలో విద్యార్థుల మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో మీడియాతో మాట్లాడుతూ.. భద్రతా చర్యల్లో భాగంగా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఐదు అడుగులున్న ప్రహరీని పది అడుగుల ఎత్తు వరకు నిర్మిస్తున్నామని, ముళ్ళకంచెను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇక కళాశాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న డిస్పెన్సరీలో 2018లో కాంపౌండర్‌ను నియమించామని తాత్కాలికంగా వైద్యసేవలు అందజేస్తున్నామని చెప్పారు. కళాశాల ఎదురుగా మెట్రో రైల్వేస్టేషన్ ఉండడంతో అనేక ఇబ్బందులు ఉన్నాయని సమస్యలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా సానుకూలంగా స్పందించారన్నారు.

### సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వండి



**సనత్‌నగర్:** గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్, శంకర్ నేత్రాలయ అధినేత డాక్టర్ రవీందర్‌గౌడ్ సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. ఈ మేరకు శనివారం గాంధీభవన్‌లో ఆయన దరఖాస్తు చేసుకున్నారు. తనకు సికింద్రాబాద్ పార్లమెంట్ టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలుపొంది తీరుతానని ధీమా వ్యక్తంచేశారు.

### నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలి



**బన్సీలాల్‌పేట్:** విద్యార్థులు ట్రాఫిక్‌పై అవగాహన పెంచుకొని నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐ కరుణాకర్‌లు అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎస్వీ కాలేజీ విద్యార్థులతో ట్రాఫిక్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్.ఐ కరుణాకర్‌లు మాట్లాడారు.